క్లుప్తంగా

అక్రమంగా గ్రావెల్ తరలించిన వాహనాలకు జరిమానా

పద్మనాభం: మండలంలోని ఐనాడలో చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు రెవెన్యూ అధికారులు జరిమానా విధించారని పోలీసులు తెలిపారు. గ్రావెల్‌తో పట్టుబడ్డ లారీకి రూ.25 వేలు, ట్రాక్టర్‌కు రూ.10వేలు, ఖాళీ ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించినట్టు చెప్పారు. ఇంకా జేసీబీకి జరిమానా విధించాల్సి ఉందన్నారు. జేసీబీ తమ స్వాధీనంలో ఉందని తెలియజేశారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యవంతమైన సమాజం

పద్మనాభం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆరగించడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించవచ్చని కోరాడ సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కోరాడలో ప్రకృతి సాగుపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారులు వనజ, విద్యా సాగర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గి, ఫలసాయం ఎక్కువగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఉత్తమ రైతులు కోరాడ లక్ష్మణరావు, పాండ్రంగి భారతిలను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విజయ్ కుమార్, రైతు పాండ్రంగి రామకృష్ణ పాల్గొన్నారు.

160 మంది విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



దివీస్ వద్ద బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: చిప్పాడ దివీస్ సంస్థ స్థానిక విద్యార్థినులకు శనివారం సైకిళ్ల పంపిణీ చేసింది. భీమిలి పరిధిలోని చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, మూలకుద్దు ప్రాంతాల్లో 7,8,9 తరగతులు చదువుతున్న 160 మంది విద్యార్థినులకు రూ.11లక్షల విలువైన సైకిళ్లను అందించింది. వాటిని సంస్థ ఉపాధ్యక్షుడు ఎల్.వి.రమణ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఇబ్బంది పడకుండా పాఠశాలలకు వెళ్లడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జీఎం కోటేశ్వరరావు, పర్యావరణ సమతుల్య విభాగ మేనేజర్ బాలాజీ, ప్రతినిధులు శ్రీనివాస్, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



అశోక్ (ఫైల్)

పీఎం పాలెం: యువకుడి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. కారుషెడ్‌కు సమీపంలోని పిలకవానిపాలెంలో అనిల్ బిష్ణోయ్ కుటుంబంతో నివసిస్తున్నారు. అతనికి స్వీట్ షాపు కూడా ఉంది. అదృశ్యం అయిన అశోక్ (18) తన వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 17వ తేదీ ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అశోక్ మరలా ఇంటికి తిరిగి రాలేదు. స్వీట్ స్టాల్‌కు కూడా వెళ్లలేదు. పరిసర ప్రాంతాల్లో వెదికినా అశోక్ ఆచూకీ లభించకపోవడంతో అనిల్ బిష్ణోయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తోటల ప్రోత్సాహానికి భూములను గుర్తించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి

పద్మనాభం: సాగు చేయకుండా ఖాళీగా ఉన్న భూములను గుర్తించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి సూచించారు. గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీ భూములు గుర్తించి, వీటిలో మామిడి, జీడి మామిడి, కొబ్బరి, జామ వంటి ఉద్యానవన పండ్ల తోటలు వేయించి, తద్వారా రైతులకు ఆదాయం చేకూర్చాలన్నారు. ఈ మొక్కలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా ఇస్తామని, మొక్కలను పెంచేందుకు పెట్టుబడి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామి పథకం ఏపీడీ కె.ఆంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం, ఏపీవో గౌరి పాల్గొన్నారు..

- తేనె మంచుతో నేలరాలిన పూత
- తట్టుకుని నిలబడినా మకరంతో కాయల్లో రంగు మార్పు
- గణనీయంగా పడిపోయిన దిగుబడి
- రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- లీజు డబ్బులెలా కట్టాలని తలలు పట్టుకుంటున్న వ్యాపారులు



మకరం ఏర్పడి రంగు మారి కుళ్లిపోయిన పనుకుల మామిడి

కృష్ణాపురంలోని తోటలో కానరాని మామిడి కాయలు

బాందేవుపురంలో చెట్లకు అక్కడక్కడ ఉన్న మామిడి కాయలు దించుతున్న రైతులు

మామిడి రైతు డీలా



పద్మనాభం: మామిడి కాపు తగ్గడంతో అన్నదాతలు, వ్యాపారులు కలత చెందుతున్నారు. మండలంలో 3వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. కృష్ణాపురం, రెడ్డిపల్లి, బాందేవుపురం, తునివలస, బర్లపేట, భద్రయ్యపేట, అనంతవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, గంధవరం, శేరిఖండం గ్రామాల్లో ఈ తోటలు ఉన్నాయి. వీటిలో కలెక్టర్, బంగినపల్లి, సువర్ణరేఖ, పనుకులు, కొలంగావో రకాలకు చెందిన చెట్లు ఉన్నాయి. ఈ చెట్లన్నీ నవంబర్‌లోనే పూతకు రాగా.. డిసెంబర్‌లో ఏకధాటిగా కురిసిన తేనె మంచు కారణంగా పూత నల్లగా మాడిపోయి, నేలపాలైంది.

పడిపోయిన దిగుబడి

సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో మొక్క తోట (15 కిలోల బాక్సు లెక్కన) 80 బాక్సులు, పెద్ద తోటలైతే 160 బాక్సుల వరకు దిగుబడి రావాలి. వాతావరణంలో మార్పుల వల్ల కాపు కాసిన తోటల్లో.. ఎకరం విస్తీర్ణంలో పదికి మించి బాక్సులు దిగుబడి రాలేదు. అదీ రంగు మారిన మామిడి కాయలే వచ్చాయి. వాటిని కిలో రూ.10కు అమ్మి వ్యాపారులు, రైతులు నష్టపోతున్నారు. ఈ పంటను కాపాడుకునేందుకు చెట్లకు మందులు కొట్టడానికి, ఎరువులు వేయడానికి రైతులు, వ్యాపారులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు సుమారు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. కాపు దెబ్బతీనడంతో రైతులకు లీజు సొమ్ము ఎలా కట్టాలో తెలియక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తమ ఇంట్లో కూడా తినడానికి మామిడి కాయలు లేకుండా పోయాయని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎగుమతిపైనా ప్రభావం

పద్మనాభం మండలం నుంచి ఢిల్లీ, కలకత్తా, ఒడిశా తదితర రాష్ట్రాలకు మామిడి కాయలను ఎగుమతి చేసేవారు. గతంలో ఢిల్లీకి రైళ్ల వ్యాగన్ల ద్వారా ఎగుమతి చేసేవారు. వ్యాగన్‌లో పది వేల బాక్సులు ఎగుమతి అయ్యేవి. ఈ ఏడాది పంట పోవడంతో కాసిన కొద్దిపాటి కాయలను ఐదుగురు షావుకార్లు కలిపి, ఒక లారీని పెట్టి ఎగుమతి చేస్తున్నారు. ఆరు వందల బాక్సులు మాత్రం ఎగుమతి అవుతున్నాయి.

మంచుకు తట్టుకున్నా.. నాణ్యత లేక..



మకరం ఏర్పడి రంగు మారిన పనుకుల మామిడి

తేనె మంచుకు తట్టుకుని తోటల్లో నిలబడిన పూత నుంచి పిందెలు వచ్చి, కాయలు కాసినా.. వాటిలోనూ నాణ్యత లేదు. మకరం వచ్చి రంగు మారిపోవడంతో వాటిని కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఇవి కూడా తోటల్లో 20 శాతం మాత్రమే కాశాయి. కొందరి తోటలు కాపు కాయక పూర్తిగా పోయాయి. సొంతంగా బాక్సులు కట్టుకుని అమ్ముకుందామని కొంతమంది రైతులు తోటులసాయానికి లీజుకు ఇవ్వకుండా ఉంచుకున్నారు. మరికొందరు లీజుకు ఇచ్చారు.

పాప చదువుకు డబ్బులెలా కట్టాలో?



మాకు 15 ఎకరాల మామిడి తోట ఉంది. దీనికి తెగుళ్లు రాకుండా మందులు కొట్టడానికి, ఎరువులు వేయడానికి, దున్నడానికి రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టాను. 15వందల బాక్సుల వరకు దిగుబడి రావాలి. కానీ, తేనె మంచుకు పూత నేల రాలింది. కొన్ని చెట్లు తేనెమంచును తట్టుకుని నిలబడడంతో కాయలు కాశాయి. సుమారు 300 బాక్సులు అయ్యే అవకాశముంది. బాక్సు రూ.800 ధర పలుకుతుంది. దీని ప్రకారం రూ.24వేలు వస్తుంది. దీనిలో సగం డబ్బులు బాక్సులు కొనడానికి, కాయలు దించడానికి కూలీలకు అయిపోతాయి. మాకు మిగిలేది రూ.12వేలు మాత్రమే. మామిడి తోట ద్వారా వచ్చిన ఆదాయంతోనే మా పిల్లలను చదివించుకుంటున్నాను. మా అమ్మాయి ఎంబీబీఎస్ చదువుతోంది. ఫ్రీ సీటు వచ్చినా, ఏడాదికి హాస్టల్‌లో ఉండడానికి, పుస్తకాలు కొనడానికి రూ.2.50లక్షలు అవసరమవుతాయి. ఈ సారి డబ్బులు ఎలా కట్టాలో తెలియడం లేదు. – ఎం.భాస్కర్, కొత్త కొవ్వాడ

తేనె మంచు కొంప ముంచింది



మాకు నాలుగెకరాల మొక్క మామిడి తోట ఉంది. దీనిలో 320 బాక్సుల వరకు దిగుబడి రావాలి. పూత దశలో తేనె మంచు కురవడంతో పూత రాలిపోయింది. పంట పోవడంతో 30 బాక్సులు మాత్రమే దిగుబడి వస్తోంది. ఈ నాలుగెకరాలకు రూ.1.20లక్షలు పెట్టుబడి పెట్టాం. ఈ బాక్సులు అమ్మితే పెట్టుబడి కూడా రాని పరిస్థితి. తేనె మంచు మా కొంప ముంచింది. – ఆర్.నర్సింగరావు, శేరిఖండం

పెట్టుబడిలో రూ.లక్ష నష్టం



నేను 5 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోట కొన్నాను. ఈ తోట మొత్తం పనుకులు రకం. రూ.60వేలకు ఫలసాయం అనుభవించేందుకు తీసుకున్నాను. ఎరువులు వేయడానికి, దుక్కులు దున్నడానికి, మందులు కొట్టడానికి రూ.1.లక్ష ఖర్చు చేశాను. ఈ 5 ఎకరాల విస్తీర్ణంలో 15 టన్నుల దిగుబడి రావాలి. మూడు టన్నులు (3వేల కిలోలు) దిగుబడి వచ్చింది. ఈ కాయలపై కూడా డిసెంబర్‌లో కురిసిన తేనె మంచుకు మామిడి కాయలపై మకరం ఏర్పడింది. కాయలు సపోటా రంగులోకి మారిపోయాయి. ఒడిశా రాష్ట్రం బర్హంపూర్ నుంచి వచ్చిన వారికి బాగున్నవి కిలో రూ.35, మకరం ఏర్పడి రంగు మారినవి కిలో రూ.10 చొప్పున ఇచ్చేశాను. దీని ద్వారా రూ.60 వేలు వచ్చాయి. ఇంకా పెట్టుబడిలో రూ.1లక్ష నష్టం వచ్చింది. – ఆర్.సన్యాసిరావు, వ్యాపారి, కొత్త కొవ్వాడ

ప్రమాదకర జారుడుబల్ల తొలగింపు



ప్రమాదకర స్థితిలో ఉన్న జారుడుబల్ల

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లోని చిల్డ్రన్స్ పార్కులో తుప్పు పట్టి, ప్రమాదకర స్థితిలో ఉన్న జారుడుబల్లను శనివారం తొలగించారు. ఇక్కడి పార్కులోని పలు పరికరాలు ప్రమాదకరంగా ఉండటంతో ఈ నెల 10వ తేదీన 'పార్కు ఇలా.. ఆటలెలా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్‌డీ జగదీష్ స్పందించారు. ముందుగా జారుడు బల్లను పార్కు నుంచి శనివారం తొలగించారు. ఆయన మాట్లాడుతూ పార్కులో తుప్పు పట్టిన పలు పరికరాలను కూడా తొలగించి, త్వరలో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకులకు, చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



జారుడుబల్ల తొలగించిన ప్రాంతం

మధురవాడ పీఏసీఎస్‌ను క్రెడిట్ సొసైటీగా మార్చాలి

- మహాజనసభలో సభ్యుల తీర్మానం

మధురవాడ: పీఏసీఎస్‌ని క్రెడిట్ సొసైటీగా మార్చు చేయాలని కొద్ది సంవత్సరాలుగా మహాజన సభ తీర్మానం చేస్తోందని, కానీ అది ఆచరణలోకి రావడం లేదని సభ్యులు తెలిపారు. దీనిపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మహాజన సభలో వారు మాట్లాడారు. దీనిపై సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించాలని తీర్మానించారు. పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, కుడిటి రామారావు మాట్లాడుతూ లాభాల్లో నడుస్తున్న మధురవాడ పీఏసీఎస్ పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల నష్టాలు చవి చూడాల్సి వస్తోందన్నారు. సంఘం ఆవరణలో ఉన్న ఓ దుకాణానికి గతంలో రూ.15వేలు అద్దె వచ్చేదని, అందులో ప్రభుత్వం ఇప్పుడు జన ఔషధిని ఏర్పాటు చేసిందని, దానివల్ల షాపు అద్దె కూడా మిగిలే పరిస్థితి లేదన్నారు. వివిధ పార్టీల నాయకులు పిళ్లా నర్సింగరావు, పిళ్లా వెంకటరావు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సూర్యప్రకాశరావు, తిరుమలరావు, నెంబర్ రాజు, నాగోతి శివాజి తదితరులు మాట్లాడారు. పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు మాట్లాడుతూ జన ఔషధిని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని, సభ్యుల అభిప్రాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యదర్శి అప్పలరాజు కార్యకలాపాలు, జమా ఖర్చులు, ఇతర అంశాలపై నివేదిక ప్రవేశపెట్టారు.



మహాజన సభకు హాజరైన సభ్యులు

గెడ్డలను, చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో సంగీత్ మాథూర్
- కోనేటి చెరువులో గ్రావెల్, రాయి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: గెడ్డలను, చెరువులను ఆక్రమించేవారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సంగీత్ మాథూర్ అన్నారు. హద్దూ..అదుపూ లేకుండా సాగుతున్న గెడ్డల ఆక్రమణలపై 'గెడ్డలు కనుమరుగు' శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గెడ్డలు, చెరువులు ఆక్రమించే వారికి ముందుగా హెచ్చరికలు జారీ చేశామని, మరల ఈ ఆక్రమణలు పునరావృతం అయితే క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో సురేష్ ఆధ్వర్యంలో 4వ వార్డు కాపులుప్పాడ పరిధి కళ్లివానిపాలెం సర్వే నంబర్ 149లో ఉన్న కోనేటి చెరువు వద్ద డంప్ చేసిన గ్రావెల్, రాయిని పొక్లెయిన్ ద్వారా తొలగించారు. అదేవిధంగా రుషికొండ స్వర్ణభారతి నగర్‌లోని సర్వే నెంబర్ 17లో గెడ్డను, రుషికొండ సర్వే నెంబర్ 28లో గెడ్డను, పెద రుషికొండ సర్వే నెంబర్ 28లో ఆక్రమణలకు గురైన గెడ్డలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



కళ్లివానిపాలెం కోనేటి చెరువులో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: సంఖ్యాబలం లేకపోయినా మోసంతో మేయర్ పీఠాన్ని దక్కించుకున్న కూటమి ప్రభుత్వం న్యాయం జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. వారు ప్రజల అవిశ్వాసానికి సిద్ధపడాలన్నారు. ఆయన మాట్లాడుతూ సంఖ్యాబలం లేకపోయినా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దొడ్డిదారిలో పదవిని లాక్కోవడం దారుణమన్నారు. సంవత్సరం పాలన పూర్తవకముందే ప్రజల్లో పూర్తి నమ్మకాన్ని కోల్పోయారన్నారు. హామీలను ఏమాత్రం నెరవేర్చకుండా, ప్రజలను మోసం చేయడమే కాకుండా, ఇటువంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

'న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన'

భీమునిపట్నం: తగరపువలస ఎన్నారై కళాశాల విద్యార్థి ఆత్మహత్యపై సరైన విచారణ జరిపి, కారకులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వైఖరి వల్ల ఒక మంచి విద్యార్థి భవిష్యత్తు నాశనమైపోయిందన్నారు. లక్షల్లో ఫీజులు చెల్లించి, ఎన్నో కష్టాలకోర్చి తమ పిల్లలను చదివిస్తుంటే యాజమాన్యం వారి ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

వ్యర్థరహిత నగరంగా విశాఖ

- జెడ్సీ కనకమహాలక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ కనకమహాలక్ష్మి



పద్మనాభం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొమ్మాది/తగరపువలస/పీఎం పాలెం/భీమునిపట్నం/పద్మనాభం: విశాఖను వ్యర్థరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని జోన్ -2 జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర-స్వచ్ఛ విశాఖ కార్యక్రమంలో భాగంగా ఎండాడ ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏఎంవోహెచ్ కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. తగరపువలసలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు, షాపు యజమానులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఎం.నాయుడు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీవాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కృష్ణంరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో డీపీవో ఎం.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు జి.వెంకటప్పడు, సర్పంచ్ జి.వెంకటనారాయణ పాల్గొన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కెవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పద్మనాభంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.



తగరపువలస డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు



బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో..



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

---

25 నుంచి కూచిపూడి ఉచిత శిక్షణ

తగరపువలస: ఆదర్శనగర్‌లోని నాట్య రవళి సంగీత నృత్య కళాశాలలో ఈ నెల 25 నుంచి 50 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నాట్యగురువు ఉమ్మిడి మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదేళ్లు నిండిన వారు ఈ శిక్షణకు రావచ్చని, 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 94400 41395, 76590 76454 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిపై దాడిలో ముగ్గురిపై కేసు నమోదు

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీలో సెల్ పాయింట్ నడుపుతున్న చంద్రంపాలేనికి చెందిన పిళ్లా వరహాలు అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపారు. జీవీఎంసీకి గిఫ్ట్‌డీడ్‌లు ఇచ్చిన స్థలాల్లో అక్రమ దుకాణాలు నిర్మించి, లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్న వ్యవహారంలో పత్రికలకు సమాచారం ఇచ్చారనే నెపంతో ఇదే గ్రామానికి చెందిన సగురుపిల్లి ప్రసాద్, సగురుపిల్లి అప్పారావు, సగురుపిల్లి నానాజీ అనే వ్యక్తులు శుక్రవారం ఉదయం వరహాలుపై దాడి చేసిన విషయం విదితమే. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

బ్లాక్ ఆయిల్ దందాపై విచారణ



ఆయిల్ నమూనాలు సేకరిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: గుట్టు చప్పుడు కాకుండా, నివాసాలకు సమీపంలో మధురవాడ ఆయోధ్యనగర్‌లో జరుగుతున్న ఆయిల్ దందాపై పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా శనివారం ఆయిల్ క్రయ విక్రయాలు సాగిస్తున్న కేంద్రం వద్దకు వెళ్లి శాంపిల్స్ సేకరించారు. ఇక్కడ జరుగుతున్న అక్రమ దందాపై ఈ నెల 17న సాక్షి దినపత్రికలో 'అక్రమాల పంథా' శీర్షికన ప్రచురితమైన కథనంపై పోలీసు అధికారులు స్పందించారు. సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. తాత్కాలికంగా పనులు నిలుపుదల చేయించినట్టు వారు చెప్పారు. పోలీసు, విజిలెన్స్ అధికారులు ఇక్కడ బిల్లులు, లావాదేవీలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. మరింత లోతుగా విచారణ చేపట్టి, చర్యలు చేపడతామని బాలకృష్ణ తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మధురవాడ: అగ్నిప్రమాదాల నివారణపై ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక పరికరాల వినియోగాన్ని కృత్యాల ద్వారా తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలు, ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలి అనేది తెలియజేశారు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.